క్లుప్తంగా

ఐఎస్‌సదన్ బీజేపీ అధ్యక్షుడిగా గిరిధర్‌రెడ్డి



సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ బీజేపీ నూతన అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నాయకుడు గంగిరెడ్డి గిరిధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి జారీ చేసిన నియామక పత్రాన్ని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డిని సురేందర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ తదితరులు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలతో కలిసి కృషి చేస్తానన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగానికి ఆరుగురు అనాథ గృహం విద్యార్థుల ఎంపిక



దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల నిర్వహించిన ప్రిలిమ్స్, ఫిజికల్ టెస్ట్, మెయిన్స్ పరీక్షల ఫైనల్ ఫలితాల్లో ఆర్‌కేపురం డివిజన్ చిత్రా లే అవుట్‌లోని అనాథ విద్యార్థి గృహం విద్యార్థులు ఆరుగురు కానిస్టేబుల్స్‌గా ఎన్నిక అయ్యారు. గృహంలో చదువుకుంటున్న ప్రశాంత్, శివలింగం, నర్సిరెడ్డి–ఏఆర్ (ఆర్మ్‌డ్ రిజర్వ్) విభాగంలో, హరీష్ అగ్నిమాపక శాఖలో, సాయినాథ్–సివిల్ డిపార్ట్‌మెంట్‌లో, నిరంజన్ –పోలీస్ టాస్క్ పోర్స్ విభాగంలో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అనాథ గృహంలో శనివారం గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. .

మాదిగల యుద్ధభేరి సభను విజయవంతం చేయాలి

నాగోలు: ఇందిరాపార్క్ వద్ద ఈ నెల 23న జరిగే మాదిగల యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జీడీ నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేసోబ్, రాష్ట్ర కార్యదర్శి హరిబాబు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వేముల సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మార్పీఎస్ టీఎస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గం అధ్యక్షుడు పంతం ఉపేందర్, ఇన్‌ఛార్జి కూరుపాటి జగదీష్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ రింగ్ రోడ్‌లో మాదిగల యుద్ధభేరి కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. నాయకులు రామస్వామి, జలంధర్, మొండి కత్తి ఎల్లయ్య, వీరమల్ల వెంకన్న, అనంత నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా రాణించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: సమాజంలో ఆర్యవైశ్యులకు మంచి గుర్తింపు ఉందని, వారి అభ్యున్నతి కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం హస్తినాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీలా మధుసూదన్‌గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని, అందుకోసం తన పూర్తి సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో కాసుల శ్రీనివాస్‌గుప్తా, శివ యాదగిరి, సారప్ప రవికుమార్, సుధాకర్ గుప్తా, ఆంజనేయులు గుప్తా పాల్గొన్నారు.

తప్పించుకొని తిరుగుతున్న దొంగ అరెస్టు

హస్తినాపురం: ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్సూరాబాద్ సహారా ఎస్టేట్ శ్రీసాయి టెంట్‌హౌస్‌లో నివాసం ఉంటున్న వాల్కే సాయి అలియాస్ టెంట్‌హౌస్ సాయి (19) అనుమానాస్పదంగా తిరుగుతుండగా పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా, ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నాడు. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు, వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు, ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన

మన్సూరాబాద్: శ్రీఇందు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ సెకండ్ అండ్ థర్డ్ ఇయర్ (ఎలక్ట్రికల్ బ్రాంచ్) విద్యార్థులు శనివారం ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనం నడపొద్దని సూచించారు.

సీఎం చొరవతో విశ్వనగరంగా 'గ్రేటర్'

మంత్రి సబితారెడ్డి



హరిపురి పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో గ్రేటర్ హైదరాబాద్ విశ్వనగరంగా మారుతోందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి సబిత ఇంద్రారెడ్డి కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్‌టీఆర్ నగర్ ఫేజ్–1 పయనీర్ స్కూల్ లైన్‌లో రూ.73 లక్షలతో వాటర్ పైప్‌లైన్ పనులకు, ఎన్‌టీఆర్ నగర్ దర్గా దగ్గర రూ.78 లక్షలతో వాటర్ లైన్ పనులకు, ఫేజ్– 3 బూడిద గడ్డ దగ్గర రూ.78 లక్షలతో వాటర్ పైప్ లైన్ పనులకు జనప్రియ గార్డెన్స్ నుంచి హరిపురి కాలనీ పార్క్ వరకు రూ. 46 లక్షలతో రోడ్డు పనులకు శంకుస్థాపనలు, జనప్రియ గార్డెన్స్ కమ్యూనిటీ హాల్ లో పబ్లిక్ రీడింగ్ రూమ్‌ను మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, 9 ఏళ్ల కిందట ఎల్‌బీనగర్ ప్రాంతం ఎలా ఉండేదో..ఇప్పుడు ఎలా మారిందో చూస్తేనే నగర అభివృద్ధి తెలుస్తోందన్నారు. నగరంలో అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు, వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి తదితర కార్యక్రమాలు రానున్న కాలంలో పెరగనున్న జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేపట్టడం జరుగుతోందన్నారు. మెట్రో విస్తరణతో అభివృద్ధి శరవేగంగా జరగనుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, సాజీద్, దుబ్బాక శేఖర్, మహ్మద్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల మెరుగుకు చర్యలు

ఎమ్మెల్యే అహ్మద్ బలాల



ఎమ్మెల్యే బలాలను సన్మానిస్తున్న కాలనీవాసులు

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ గడ్డిఅన్నారం, బడాబజార్‌లో శనివారం ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు, కొత్త వాటర్, సీవరేజ్ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మురుగు సమస్యకు చెక్ పెట్టే విధంగా చూస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో రాజీపడే ప్రసక్తి లేదని, ఆదర్శవంతమైన నియోజవర్గంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ గండి కృష్ణాయాదవ్, సంఘిరెడ్డి, శ్రీనప్ప, చీకోటి శ్రవణ్, ఇలీయాస్, ముజ్జు, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

చలాన్ల వసూలుపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు: కొప్పుల

మన్సూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి ట్రాఫిక్ పోలీసులకు టార్గెట్లు విధించి వారిచే చలాన్లు వసూలు చేయించడంపై ఉన్న శ్రద్ధ గుంతలమయంగా మారిన రోడ్ల అభివృద్ధిపై లేదని జీహెచ్ఎంసీలో బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మండిపడ్డారు. పనామా చౌరస్తా వద్ద శనివారం ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు చలాన్లు విధిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, వాహనాలను నిలిపి చలాన్లు చెల్లించే వరకు వదిలేదిలేదని వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. గుంతలమయంగా ఉన్న రోడ్లను పూడ్చి అభివృద్ధి చేయాలనే సోయి మాత్రం ప్రభుత్వానికి లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలపై భారం వేయడంలో ఉన్న శ్రద్ధ వసతులు కల్పించడంలో లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నవీన్, అశోక్, వెంకట్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేని నియోజకవర్గమే లక్ష్యం



గాయత్రినగర్ ఫేజ్–2లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమౌతున్నాయని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీ గాయత్రినగర్, గాయత్రినగర్ ఫేజ్– 2,3,4, భవాని ఎన్‌క్లేవ్, గాయత్రినగర్ బ్యాంక్ కాలనీ, మారుతినగర్, వెంకటేశ్వర కాలనీ, జక్కిడి రామచంద్రరెడ్డి కాలనీ, వినాయకహిల్స్, సామనగర్, ఆఫీసర్స్ కాలనీ, గౌతమ్‌నగర్, గాంధీనగర్, ఎస్‌కేడీనగర్, దుర్గాసాయినగర్ కాలనీ, సాగర్‌హౌసింగ్ కాంప్లెక్స్, చైతన్యనగర్ కాలనీలలో శనివారం సుమారు రూ.9 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, శివారులోని ప్రతి కాలనీకి మౌలిక సదుపాయాలు కలిపిస్తానన్నారు. సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, అనితర సాధ్యమైన రిజిస్ట్రేషన్ సమస్యను 118 జీఓతో పరిష్కరించామన్నారు. ప్రజలంతా ఆలోచించి మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, నాయకులు అనిల్‌చౌదరి, శ్రీధర్‌గౌడ్, శంకరయ్యగౌడ్, నరసింహారెడ్డి, సందీప్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కాలనీల అధ్యక్షుడు కార్యదర్శులు రమేష్, గోవర్ధన్‌చౌదరి, జగన్మోహన్‌రెడ్డి సరస్వతి, మహేందర్‌రెడ్డి, రాజుయాదవ్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్‌కు శంకుస్థాపన

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని జయకృష్ణా ఎన్‌క్లేవ్ కాలనీలో ఐదుకోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న స్విమ్మింగ్ పూల్ పనులకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అండోజు సత్యంచారితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చానని, వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. నాయకులు రమాపత్ శ్రీనివాస్‌నాయక్, నల్ల నాగిరెడ్డి, ఉదయ్‌రెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో 3,718 కోట్ల అభివృద్ధి చేశాం

హయత్‌నగర్: గత 50 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ చేయని అభివృద్ధిని సీఎం కేసీఆర్ చేశారని, ఒక్క ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోనే గత ఐదేళ్లలో 3,718 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం హయత్‌నగర్‌లో నిర్వహించిన మన్సూరాబాద్ తూర్పు కాలనీల సంక్షేమ సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలి

చాదర్‌ఘాట్: విద్యార్థులు అధునాతన టెక్నాలజీని వినియోగించుకొని భవిష్యత్‌లో స్థిరపడి కాలేజీకి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని శ్రీవాణి డిగ్రీ మహిళా కళాశాల కరస్పాండెంట్ సుభాష్‌గౌడ్ అన్నారు. శనివారం మలక్‌పేటలోని సిమ్లా గార్డెన్‌లో కళాశాల ఫ్రెషర్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ విమలారెడ్డి, సిబ్బంది అనుప్రియ, రాములు, ఖాన్, గిరిధర్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలి

దిల్‌సుఖ్‌నగర్: నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగే ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని గ్రేటర్ హైదరాబాద్ ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు, ఎల్‌బీనగర్, మహేశ్వరం ఇన్‌ఛార్జి బండారి శ్రీనివాస్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం ఆర్‌కేపురం డివిజన్ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బొబ్బిళ్ల వెంకటేశ్వర కుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌నగర్‌లో ఇంటింటికీ తిరిగి కరప్రతాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో 14. 7 శాతం ఉన్న ముదిరాజ్‌లకు అన్ని రాజకీయ పార్టీలు 20 ఎమ్మెల్యే, 3 ఎంపీ టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ఎన్టీఆర్‌నగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సిరికొండ ఎల్లం, ఉపాధ్యక్షుడు కట్ట వెంకటేశం, గంగన బోయిన వెంకటేష్, దివిటి వెంకటేష్, బండారి మల్లేష్ పాల్గొన్నారు.



సీసీ రోడ్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

సమస్యల పరిష్కారమే ధ్యేయం

మలక్‌పేట: డివిజన్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగున్నామని మూసారంబాగ్ బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సలీంనగర్ బాలదానమ్మ బస్తీలో సీసీ రోడ్డు పనులను శనివారం ఆమె ప్రారంభించారు. అనంతరం రామాలయం నుంచి ఆరోరా కాలేజీ వరకు కొనసాగుతున్న నూతన డ్రైనేజీ పైప్‌ లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. చిన్న గల్లీలలో కూడా సీసీ రోడ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పైప్‌లైన్ పూర్తయ్యాక రామాలయం లేన్‌లో కూడా రోడ్డు పనులు మొదలవుతాయన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, వీరేశం, హరీష్, యాదగిరి, సంతోష్, సురేందర్, దినేష్ తదితరులు ఉన్నారు.

అంతర్గత రోడ్లనూ ఆధునీకరిస్తాం



ఏకలవ్యబస్తీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణారవీందర్‌రెడ్డి

సైదాబాద్: సైదాబాద్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రహదారులను సైతం ఆధునీకరిస్తామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి తెలిపారు. శనివారం కార్పొరేటర్ బస్తీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ఏకలవ్యబస్తీలో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మొదట తాగునీరు, డ్రైనేజీల పైప్‌లైన్ పనులు చేపట్టామని, ఆయా ప్రాంతాల్లో పైప్‌లైన్ పనులు పూర్తయ్యాక అక్కడ తిరిగి రహదారులను నిర్మిస్తామని తెలిపారు. తమ ప్రాంతంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను స్థానికులు తరచూ పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమణ్ సింగ్, మనోజ్, పంకజ్, సాయి పాల్గొన్నారు.

ఆలయం పై నుంచి బ్రిడ్జి నిర్మిస్తే అడ్డుకుంటాం

సైదాబాద్: సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ దేవాలయం పైనుంచి వెళ్లేలా బ్రిడ్జి నిర్మించాలని చూస్తే అడ్డుకొని ఆందోళనలకు దిగుతామని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, కుర్మగూడ మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ అధికారులను హెచ్చరించారు. శనివారం నిర్మాణ పనుల పరిశీలనకు వచ్చిన జీహెచ్ఎంసీ సర్కిల్–6 ఈఈ సురేష్ ఇతర అధికారులతో ఆయన ఈ విషయమై వాగ్వాదానికి దిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చంచల్‌గూడ ప్రింటింగ్ ప్రెస్ నుంచి సంతోష్‌నగర్ వరకు నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న ఆలయం కమాన్ ముందు నుంచి వెళ్తుందని మొదట్లో అధికారులు తెలిపారన్నారు. అయితే బ్రిడ్జి నిర్మాణం కోసం ఇటీవల తీస్తున్న పిల్లర్ గుంతలను పరిశీలిస్తే బ్రిడ్జి ఆలయం పైనుంచి వెళ్లేలా తెలుస్తోందన్నారు. అధికారులు ఎవరికీ లాభం కలగడానికి ఇలా చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలయానికి అపచారం కలిగేలా స్టీల్‌బ్రిడ్జి నిర్మించేందుకుయత్నిస్తే అడ్డుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు.

కేంద్ర మంత్రిని కలిసిన వికలాంగుల సంఘాల నేతలు



కేంద్రమంత్రి ప్రతిమ భౌమిక్‌కు సమస్యలు వివరిస్తున్న నాయకులు

మలక్‌పేట: ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిసెబుల్డ్ (ఫెడ్) ఆధ్వర్యంలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి ప్రతిమ భౌమిక్ శనివారం బేగంపేటలో కలిసి దివ్యాంగులకు అన్ని రంగాల్లో రిజర్వేషన్ల అమలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేసినట్లు ఫెడ్ చైర్మన్ గంగారామ్, ప్రధానకార్యదర్శి చెరుకు నాగభూషణం తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జనజీవన జాగృతి అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి, అఖిల భారత వికలాంగుల వేదిక అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు, బధిరుల స్వాతంత్ర సంస్థ ప్రతినిధి రఘునందన్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు ప్రఫుల్ రాంరెడ్డి ఉన్నారన్నారు.

నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఫొటో అండ్ వీడియోగ్రఫీలో వస్తున్న నూతన టెక్నాలజీని ఫొటో, వీడియోగ్రాఫర్లు అందిపుచ్చుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం, ఫొటోటెక్ సంయుక్త ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో జరుగుతున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను ఎమ్మెల్యే శనివారం సందర్శించారు. ఎక్స్‌పో లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఫొటో అండ్ వీడియోగ్రఫీలో వచ్చిన నూతన టెక్నాలజీని ఆసక్తిగా గమనించారు. కార్యక్రమంలో సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడు ఉపేందర్‌గుప్తా, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్, వ్యవస్థాపక అధ్యక్షుడు సంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, ఫొటోటెక్ అధినేత అభిమన్యురెడ్డి, జయమాధురి, తులసి, విజయలక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం

బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ నాయకులు

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపిస్తామని బీఆర్‌ఎస్ ఎస్సీ విభాగం నాయకులు పిలుపునిచ్చారు. సుధీర్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ నియోజకవర్గ ఎస్సీ నాయకులు నాగోలులో సమావేశం నిర్వహించారు. అనంతరం నాగోలు గ్రామం, సువ్వలబండ, జైపురి కాలనీ, బండ్లగూడ ప్రాంతంలోని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో సమావేశాలు నిర్వహించి త్వరలోనే ఎస్సీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి నూతన కమిటీని వేస్తామన్నారు. ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సుధీర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ నాయకులు తూర్పాటి చిరంజీవి, అడాల రమేష్, జోగు రాములు, గోల్కొండ మైసయ్య, బాల సుందరం, రుద్రల స్వామి, మల్లెపాక యాదగిరి, గంగా శివశంకర్, గాలయ్య, ఇర్గి రమేష్, కొంగర మహేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి

చైతన్యపురి: కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా శనివారం ఆయన డివిజన్‌లోని పీ అండ్ టీ కాలనీలో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ జవాన్ యాదగిరి, ఎస్ఎఫ్ఐ యాకయ్య, శ్రీనివాస రెడ్డి, కాలనీ అధ్యక్షుడు అశోక్, ఓంకార్, శరత్, శివరామ, బొమ్మరాజు రవి, హరీష్, శ్రీకాంత్, దాసరి జయప్రకాష్, సాయి, వివేక్, టింకు పాల్గొన్నారు.

సిటీలో మొదటి 'టీ' ఏటీఎం ప్రారంభం

మనిషి అవసరం లేకుండానే 24 గంటలూ 'చాయ్'



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని మొదటిసారిగా 'మనుషుల అవసరం లేకుండానే కృత్రిమ మేధస్సు (ఏఐ–ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్)తో పనిచేసే' టీ–ఏటీఏంను ఎల్బీనగర్ ఎల్‌పీటీ మార్కెట్ వేదికగా ప్రారంభించారు. నగరానికి చెందిన జెమ్ ఓపెన్ క్యూబ్ సంస్థ ఆధ్వర్యంలో వెండింగ్ టెక్నాలజీలో నూతన ఒరవడితో రూపొందించిన ఈ టీ–ఏటీఏంను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి టీఎస్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వేద రజిని హాజరై, వినూత్నంగా తయారు చేసిన ఈ సాంకేతికతను అభినందించారు. ఈ సందర్భంగా జెమ్ ఓపెన్ క్యూబ్ సీఈఓ పి.వినోద్ కుమార్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి మూలలో డబ్ల్యూటీసీ మెషీన్‌లను విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు.నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం కేవలం లక్షా 67 వేల రూపాయలకే లభ్యమయ్యే కాఫీ, లెమన్ టీ, బాదం పాలు, బిస్కెట్‌లతో సహా మంచి నీటి బాటిల్‌లను అందించే 'డిజిటల్ చాయ్' లేదా 'చాయ్ ఏటీఎం' గా పిలువబడే ఈ యంత్రాన్ని మార్కెట్‌లోకి విడుదల చేశామన్నారు. జెమ్ ఓపెన్‌క్యూబ్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేష్ యాదవ్, ప్రకాష్ వేలుపుల, త్రిలోచన్ దువా, తారక రంగ రెడ్డి, వెకంట్రామిరెడ్డి, శ్యామ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

'సత్యాగ్రహ దీక్ష' భగ్నం

- పలువురు విద్యార్థి నాయకుల అరెస్టు
- అంబేడ్కర్ బాయ్స్ హాస్టల్‌లో దీక్ష కొనసాగింపు



పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులు

మలక్‌పేట: తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మూసారంబాగ్ చౌరస్తాలో చేపట్టిన సత్యాగ్రహదీక్షకు అనుమతి లేదంటూ మలక్‌పేట పోలీసులు నాయకులను అడ్డుకున్నారు. దీక్షను తలపెట్టిన టీఎస్ఎస్ఏ నాయకులను అరెస్ట్ చేసి మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్, గ్రేటర్ అధ్యక్షుడు నక్క వెంకటేష్, నాయకులతో పీఎస్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లకు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయడంలో సర్కార్ విఫలమైందన్నారు. పరీక్షలు సక్రమంగా చేపట్టకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్సీ బోర్డును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెంచిన మెస్ చార్జీలు అమలుకు నోచుకోలేదన్నారు. నిర్బంధాలతో విద్యార్థి ఉద్యమాలను అణిచి వేయాలని చూస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్రనాయకులు మేడి నాగరాజు, సత్యనారాయణ, ఉదయ్, జిల్లా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాయ్స్ హాస్టల్ ప్రాంగణంలో దీక్ష కొనసాగింపు..

పోలీసులు దీక్షను భగ్నం చేయడంతో టీఎస్ఎస్ఏ నాయకులు, విద్యార్థులతో కలిసి మూసారంబాగ్‌లోని అంబేడ్కర్ బాయ్స్ హాస్టల్‌లో సత్యాగ్రహ దీక్ష ను కొనసాగించారు. దీక్షకు నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలం వెంకటేష్, మోదీ రాందేవ్, స్వేరో స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిపాక నవీన్, పీడీఎస్‌యూ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి మందుల సైదులు దీక్షకు మద్దతు తెలిపారు.